అప్పుడు రాత్రిఏడు గంటలైంది.

చీకట్లో ఆ ఇంటి ముందు రాంబాబూ, కిష్టయ్యా తచ్చాడుతున్నారు.

అది నీలిమ భర్త రంగనాధరావు ఇల్లు! ఇంట్లో ఎవరూ ఉన్నట్టు అనిపించలేదు వాళ్లకి.

"ఎందుకైనా మంచిది.....కాంపౌండ్ వాల్ దగ్గరికి వెళ్లి లోపలికి తొంగిచూశాడు. వెంటనే వెనక్కి వచ్చాడు.

'ఎవరూ లేరు గురూగారూ.....ఇల్లు తాళం వేసుంది' సంతోషంగా అన్నాడు కిష్టయ్య.

'సరే అయితే...నేను లోపలికి వెళ్తాను. నువ్వు ఇక్కడే కాపలాఉండు. ఆ రంగనాధరావు కనుక రావడం కనిపిస్తే రెండుసార్లు విజిల్ వెయ్యి....నేను వెంటనే బయటికి వచ్చేస్తాను......' అన్నాడు రాంబాబు.

'అట్లాగే గురూగారూ' తలూపాడు కిష్టయ్య.

రాంబాబూ జేబులోంచి మారు తాళాల గుత్తి బయటికి తీశాడు.

ఆ తాళాల గుత్తి వాళ్లకి డిటెక్టివ్ సింహస్వప్న ఇంట్లోంచి కొట్టుకొచ్చిన మేకప్ బాక్స్ లో దొరికింది.

'జాగ్రత్త....ఈల వెయ్యడం మర్చిపోవద్దు.......'

మరోసారి కిష్టయ్యని హెచ్చరించి మెల్లగా అడుగులు వేసుకుంటూ కాంపౌండ్వాల్ సమీపించి అటూ ఇటూ చూసి తననెవరూ గమనించడం లేదని నమ్మకం కలిగాక చటుక్కున గేటు తీసుకుని లోపలికి వెళ్లాడు.

ఒక అయిదు నిమిషాలపాటు రకరకాల తాళం చెవులతో తంటాలు పడ్డాక తలుపుకు వేసిన తాళం కప్ప తెరుచుకుంది.

మెల్లగా గడియ తీసుకుని లోపలికి ఆడుగు పెట్టాడు రాంబాబు.

అంతా చీకటిగా ఉంది.

గది గుమ్మం పక్కన గోడమీద తడిమాడు. స్విచ్ చేతికి తగిలింది.

రాంబాబు గదిని పరిశీలనగా చూశాడు.

అది డ్రాయింగ్ రూమ్. గదిలో ఖరీదైన ఫర్నీచర్ ఉంది. గోడలకు ఆయిల్ పెయింట్స్ ఉన్నాయ్. నేలమీద మెత్తటి కార్పెట్ పరచివుంది.

ఒక బ్యాంక్‌లో క్యాషియర్ ఉద్యోగం చేసేవాడి ఇంట్లో ఇంత ఖరీదైన ఫర్నీచర్ ఎల వచ్చింది? ఎన్ని మోసాలు చేసి సంపాదించాడో!?.

తనది వట్టి అనుమానమేనేమో ఉద్యోగం మాముందే కావొచ్చు.....కానీ అతనికి ఆస్థిపాస్తులు బాగా ఉన్నాయేమో!.....

మరి సరోజ చెప్పిన సంగతో!!.....

సరోజ, లక్ష్మి సినిమాకి వెళ్లినప్పుడు హాల్లో మరో వన్నెలాడితో రంగనాధరావుని వాళ్ళు కళ్ళారా చూశారు. అప్పటికి నీలిమ చనిపోయి ఎన్ని రోజులో కాలేదు.

రంగనాథరావూ ఆ అమ్మాయి ఒకరిమీద ఒకరు ఒరిగిపోతూ పిచ్చిగా ప్రవర్తించారట!

అలాగయితే రంగనాథరావు ప్రదర్శించిన విచారమంతా నటనేనా?..... అందులో ఏమైనా రహస్యం ఉందా? రంగనాథరావు ఇంకెవరో అమ్మాయిని ప్రేమించి నీలిమని అడ్డు తొలగించుకోడం కోసం ఆమెని?...

అందుకే రంగనాథరావు ఇల్లు సోదాచేస్తే ఏమైనా ఆధారాలు దొరుకుతాయని వచ్చాడు రాంబాబు.

మెల్లగా హాల్లోంచి లోపలి గదిలోకి వెళ్లాడు.

లైట్ వేశాడు.

రాంబాబు దృష్టి గదిలోని బీరువా మీద పడింది. వెంటనే తన చేతి లోని మూడు తాళం చెవులగుత్తికి పని కల్పించాడు.

పెద్దగా కష్టపడకుండానే బీరువా తెరుచుకుంది. దానినిండా చీరలు ఉన్నాయ్.

మంచి మంచి చీరలు.

అది నీలిమ బీరువా.

మెల్లగా అ బీరువాలో సోదాచెయ్యడం మొదలు పెట్టాడు. అయిదు నిముషాలు తరువాత చీరల మధ్యలో అతనికో డై రీ కనిపించింది.

అది నీలిమ డైరీ!....

మెల్లగా డైరీ పేజీలు తిరగేసిన రాంబాబు కళ్ళు ఆశ్చర్యంతో విప్పారాయ్.

అంతలో బయటినుండి రెండుసార్లు విజిల్ వినబడింది.

రాంబాబు కంగారుగా ఆ డైరీని ప్యాంటులో దోపుకుని బీరువా మూసి గదిలోని లైట్లు ఆర్పి బయటికి పరుగెత్తుకుని వచ్చాడు.

సందుకి ఈ చివరా, ఆ చివరా చూశాడు. ఎవరూ రావడం కనిపించలేదు.

కిష్టయ్య చీకట్లో నింపాదిగా నిల్చుని ఉన్నాడు.

రాంబాబు కిష్టయ్య దగ్గిరికి కంగారుగా వెళ్ళాడు.

'రంగనాథరావు ఏడీ?' అని అడిగాడు.

కిష్టయ్య ఆశ్చర్యంగా చూశాడు.

'నాకేం తెల్సు?'

'మరి ఇప్పుడు విజిల్ వేశావెందుకూ?' రాంబాబు కోపంగా అడిగాడు.

కిష్టయ్య సిగ్గుపడ్డాడు.

'అదికాదు గురూగారూ.....మీరు రంగనాథరావుగానీ వస్తుంటే చూసి విజిలు వేయమని చేప్పారు కదా.....కాస్సేపయ్యాక నాకు అనుమానం వచ్చింది నేను విజిలెయ్యగల్నా అని!.....'

'ఆ చచ్చు అనుమానం ఎందుకొచ్చింది?'

‘ఇప్పటిదాకా నేనెప్పుడూ విజిలెయ్యలేదు గురూగరూ.... అందుకే అసలు వెయ్యగలో్నే లేదో అని ట్రయిల్ వేస్కుని చూస్కున్నా .....’

రాంబాబు తల కొట్టుకున్నాడు.

‘సరేగానీ ....చాల ముఖ్యమైన డైరీ దొరికింది....దీన్ని నీ దగ్గర ఉంచు ...నేను మళ్ళీ లోపలికి వెళతాను......’ అంటూ ప్యాంటులో దోపుకున్న డైరీ తీసి కిష్టయ్యకి ఇచ్చి గబగబా ఆ ఇంట్లోకి వెళ్లాడు రాంబాబు.

ఈసారి నీలిమ బెడ్‌రూమ్‌లో మంచం క్రింద, పరుపుల క్రిందా అంతా వెతికాడు.

తరువాత ఆ పక్క గదిలోకి వెళ్ళాడు.

అక్కడ మరో బీరువా ఉంది. దాన్ని కూడా మారు తాళం చెవులతో తెరిచాడు.

అది రంగనాధరావు బీరువా.

దాన్నికూడా సోదాచేసిన రాంబాబుకి కొన్ని కాగితాలు కనిపించాయ్.

వాటిని చూసిన రాంబాబు ఇంకా ఆశ్చర్యపోయాడు. ఆ కాగితాలని మడతపెట్టుకుని జేబులో పెట్టుకున్నాడు.

ఆ గదిలో గోడకి వేలాడుతున్న నీలిమ ఆయిలు పెయింటింగ్ రాంబాబు దృష్టిని ఆకర్షించింది.

చాలా బాగుంది ఆ పెయింటింగ్, ఎదురుగా మనిషి ఉన్నట్టే ఉంది.

ఇంత అందమైన అమ్మాయిని హత్య చేయ్యడానికి ఎవరికి చేతులు వచ్చాయో!!.....

గోడకి ఉన్న మేకునుండి ఆ పెయింటింగ్‌ని చేతుల్లోకి తీస్కుని తదేకంగా దానివంక కాస్సేపు చూసి నిట్టూర్చాడు.

ఈమె తన స్టూడియోకి రావడం వల్లే కద తను ఇన్ని గోడవల్లో ఇరుక్కున్నాడు?!

మళ్ళీ పెయింటింగ్‌ని యథాస్థానంలో ఉంచడానికి చూసిన రాంబాబుకి గోడలోని ఓ బటన్ కనిపించింది.

పెయిటింగ్ వెనకాల ఈబటన్ ఏమిటి?..... కుతూహలంగా రాంబాబు ఆ బటన్‌ని నొక్కాడు.

అంతే......గదికి ఒక మూల గోడ రెండుగాచీలి దారి ఏర్పడింది.

రాంబాబు నోరు తెరుచుకుని అలా కొన్ని క్షణాలు చూస్తూ ఉండిపోయాడు.

ఇంతలో బయటినుండి రెండుసార్లు విజిలు వినిపించింది.

రాంబాబు కంగారుగా బటన్ మరోసారి నొక్కాడు. మళ్ళీగోడ యధాస్థానంలోకి జరిగి రహస్య ద్వారం మూసుకుపోయించి.

రాంబాబు బటన్‌మీద నీలిమ పెయింటింగు తగిలించేసి బయటికి పరుగుతీశాడు.

కంగారుగా పరుగెత్తుకు వచ్చిన రాంబాబునిచూసి కిష్టయ్య అడిగాడు.

‘మళ్ళీ విజిల్ మోత విని వచ్చారా?’

'ఏం మళ్ళీ విజిలెయ్యడం ప్రాక్టీసు కేశావా?' పళ్ళు కొరుకుతూ అడిగాడు రాంబాబు.

'కాదు గురూగారూ..... ఆ ఎదురింటి డాబామీద ఒకమ్మాయి నిల్చుని ఉంది.....ఇటువైపునుండి సైకిలు మీద ఎవడో జులాయ్ వెధవ వెళ్తూ ఆ అమ్మాయినిచూసి విజిలేశాడు...నేను కాదు....'

రాంబాబు మళ్ళీ నెత్తి కొట్టుకున్నాడు.

'సరేగానీ.....ఇదిగో ..... రంగనాధరావు బీరువాలో ఈ కాగితాలు దొరికాయ్. వీటిని చూస్తుంటే రంగనాధరావుకి స్మగ్లింగు గ్యాంగుతో సంబంధం ఉన్నట్టుంది......' రాంబాబు కిష్టయ్యకి జేబులోని కాగితాలు తీసిఇచ్చాడు.

'స్మగ్లర్స్ గురించిన బాధ మనికి లేదు గురూగారూ....వాళ్ళ స్థావరం మనికి తెలిసింది...... ఈ వెనుకలైను ఇంట్లోనేగా మిమ్మల్ని కిడ్నప్ చేసి బంధించింది?.... పోలీసులకి వాళ్లని పట్టించి మీరు స్మగ్లర్ కాదని నిరూపించుకోవచ్చు.....ఎటోచ్చీ నీలిమ హత్యతోనే వచ్చింది ప్రాబ్లెమ్....ఆమె హత్యకి సంబంధించి ఆధారాలు ఏమీ దొరకలేదా?'

రాంబాబు తల అడ్డంగా ఊపాడు.

'రంగనాధరావు గదిలో ఒక రహస్యద్వారం ఉంది.....' అంటూ నీలిమ పెయింటింగు కింద బటన్ ఉండడం అది నొక్కితే రహస్యద్వారం తెరుచుకోవడం చెప్పాడు రాంబాబు.

'నేను ఆ రహస్య ద్వారంలో ఏముందో చూసివస్తాను..... నువ్విక్కడే ఉండు.....' అంటూ మళ్ళీ ఇంట్లోకి పరుగుతీసి నీలిమ పెయింటింగు తీసి గోడకున్న బటన్ని నొక్కాడు.

గోడ విడిపోయి మార్గం ఏర్పడింది.

అందులోంచి తొంగిచూశాడు. కిటికి మెట్లున్నాయ్..... రాంబాబు జేబులోంచి పెన్‌టార్చి తీసి వెలిగించి ఒక్కొక్క మెట్టే మెల్లగా దిగసాగాడు.

బయట రాంబాబు కోసం ఎదురుచూస్తున్న కిష్టయ్య ఉలిక్కిపడ్డాడు. దూరంగా సందు మోదట్లో రంగనాధరావు రావడం కనిపించింది.

కిష్టయ్య కంగారుగా విజిలు వేశాడు.

కాని అప్పటికే సోరంగ మార్గం గుండా మెల్లు దిగుతున్న రాంబాబుకి విజిలు వినిపించలేదు.

## *ఫ్రేమ్ - 33*

### *రాంబాబే బిగ్‌బాసైతే?*

రాంబాబు మెల్లగా మెట్లు దిగసాగాడు.

అతని మనసులో ఎన్నో ఆలోచనలు!.....

రంగనాధరావు ఇంట్లో రహస్య ద్వారం ఎందుకు ఉంది? అతని ఇంట్లో స్మగ్లింగ్‌కి సంబంధించిన కాగితాలు ఉన్నాయ్.... అంటే స్మగ్లర్లకు అతను తోడ్పడుతున్నాడా?

నీలిమ డైరీలో తను అక్కడక్కడా చదివాడు. చదివిన కాస్తదాన్ని బట్టీ నీలిమకి రంగనాధరావు యాక్టివిటీస్ నచ్చలేదని తెలుస్తూంది. ఎంతో బాధపడుత్తూ రాస్కుంది డైరీ.

కొంపతీసి రంగనాధరావే నీలిమని హత్య చేశాడా? దానికి సంబంధించి ఏదైనా ఆధారం దొరికితే తను హత్యానేరం నుండి స్మగ్లింగ్ నేరంనుండీ బయటపడొచ్చు.

ఇలా ఆలోచిస్తూండగానే రాంబాబు మెట్లన్నీ దిగేశాడు.

ఇప్పుడతను ఒక అద్దాల క్యాబిన్‌లో ఉన్నాడు. అక్కడ ఒక కుర్చీ ఉంది.

తన ఎదురుగా కనిపించిన దృశ్యం చూసి రాంబాబు అదిరిపడ్డాడు.

అక్కడ పాతికమందిదాకా రౌడీలున్నారు. వాళ్లలో జగ్గూ, వీరూలు కూడా ఉన్నారు.

తను ఆడవేషంలో ఉండగా జగ్గూ వీరూలు తనని కిడ్నాప్‌చేసి అక్కడికే తెచ్చారు. ఆ గ్లాస్ కాబిన్‌లోంచే బిగ్‌బాస్ తనతో మాట్లాడాడు. రంగనాధరావు ఇంట్లోంచి డెన్‌కి రహస్యమార్గం!

అంటే రంగనాధరావే బిగ్‌బాసా?!..... ఆ ఆలోచన రాగానే 'కెవ్వ్' మని అరిచాడు రాంబాబు.

రాంబాబు అరుపువిన్న డెన్‌లోని రెడీలందరూ గ్లాస్ క్యాబిన్‌వైపు చూసారు.

బిగ్‌బాస్ వచ్చాడు.... బిగ్‌బాస్ వచ్చాడు' అనుకుంటూ అందరూ అటెన్షన్‌లో నిలబడ్డారు.

'ఎందుకు బాస్ అట్లా అరిచారు?.... ఏ జరై ౯నా , తేలైనాకుట్టిందా?.... అసలే అక్కడ చీకటి ఏమీ కనబడి చావదు....' అన్నాడు జాకాల్ నీడలో కనిపిస్తున్న రాంబాబు వంక చూస్తూ.

రాంబాబు 'ఆ..... ఊఊ ......' అన్నాడు భయం భయంగా కుర్చీలో కూర్చుంటూ.

అతని ఎదురుగా మైక్ ఉంది.

'ఏంటి బాస్ మీ రివాళ గెటప్ మార్చేసారు..... ఇప్పటిదాకా మీ సర్వీసులో ఎప్పుడైనా టోపీ పెట్టుకోకుండా వచ్చారా?.....' అన్నాడు జాకాల్.

రాంబాబు చురుకుగా ఆలోచించసాగాడు.

వీళ్ళు తననే బిగ్‌బాస్ అనుకుంటున్నారు. ఇక్కడ చీకటిగా ఉండడం తన మంచికే అయింది. ఇప్పుడు తను బిగ్‌బాస్‌లా నటించాలి. వీళ్ళకి ఏ మాత్రం అనుమానం వచ్చినా తనని చంపేస్తారు.

'ఎప్పుడూ మనమే టోపీ పెట్టుకుంటే ఎలా?..... అప్పుడప్పుడూ వేరేవాళ్ళకి కూడా పెడ్తూండాలి. ఇందాకనే ఒక వజ్రాల వర్తకుడికి టోపీవేళా .....ఇంక నా అసలు టోపీ గురించి ....ఎలకలు కొట్టేశాయ్....వేరేది కొనుక్కోవాలి!.....' అన్నాడు రాంబాబు.

జాకాల్ అనుమానంగా రాంబాబు వంక చూశాడు.

'ఏంటలా చూస్తున్నావ్?..... నే చెప్పింది నిజమే......కావాలంటే రేపు ఎలకలు కొట్టేసిన ఆ టోపీ తెచ్చి చూపిస్తా.....' కంగారు దాచుకుంటూ అన్నాడు రాంబాబు.

'అదికాదు బాస్ .....మీ గొంతు వేరేగా ఉందేంటి?.....

వేరేగా ఉందంటే ఉండదూ మరి? ఆ వజ్రాల వర్తకుడిఎలా టోపీ వెయ్యాలా అని ఆలోచిస్తూ ఆలోచిస్తూ దిక్కుతోచక అన్నం సయించలేదు..... కాబట్టి అన్నం తినలేదు. అన్నం తినకుండా ఎండలో అక్కడ ఇక్కడ  తిరగడంవల్ల బాగా వేడిచేసింది. వేడి చేయడంవల్ల జలుబు చేసింది.....జలుబు చేయడంవల్ల గొంతు మారింది ....అంతే .....' అన్నాడు రాంబాబు గబగబా.

'ఏంటో బాస్....మీ పవర్ రోజురోజుకీ తగ్గిపోతూంది.'

'షటప్ జాకాల్!....నా ఇష్టమొచ్చిన గొంతులో మాట్లాడతాను నువ్వెవరు అడగాడానికి అనడానికి పోయి నాకు ఇంత పెద్ద ఎక్స్‌ప్లనేషన్ ఇచ్చారు.....' దిగులుగా అన్నాడు జాకాల్.

అయితే వీడిపేరు జాకాల్ అన్నమాట !

'షటప్ జాకాల్ ....ఆపు నీ అధిక ప్రసంగం' అన్నాడు రాంబాబు ధైర్యంగా.

జాకాల్ తృప్తిగా ఊపిరి పీల్చుకున్నాడు.

'కానీ బాస్..నెత్తిమీద ఆ టోపీ లేకపోతే మీకు నిండుతనం కళాలేవు బాస్......'

'చెప్పానుగా కొత్తది కొనుక్కుంటానని!' హామీ ఇచ్చాడు రాంబాబు.

'బాస్!..... నాకు ఇప్పించండి బాస్' అంటూ గట్టిగా అరిచాడు వీరూ వెంటనే.

'కాదు బాస్...నాకే ఇప్పించండి బాస్.....' అన్నాడు జగ్గూ ఇంకా గట్టిగా.

'లేదు బాస్....నాకు ఇప్పించండి బాస్.....' అంటూ ఒక్కో రౌడీ అరవ సాగాడు.

'ఓక్కే .....ఓక్కే .....వచ్చేనెల పండగ వస్తుందిగా ....మీ అందరికీ కొత్తటోపీ కొనిపెడ్తాలే.....' అన్నాడు రాంబాబు.

'వాళ్ళు ఇప్పించమన్నది టోపీ కాదు బాస్. మీకు టోపీ కొనిపెట్టే అవకాశాన్ని ఇప్పించమని అడుగుతున్నారు.....' చెప్పాడు జాకాలు.

వీళ్ళకి బాస్ అంటే ఎంత శ్రద్ధ, గౌరవం?..... రాంబాబు ఆశ్చర్యపోయాడు.

'వద్దులే ...నా టోపీ నేనే పెట్టుకుంటాను. నాకు ఒకళ్ళచేత టోపీ పెట్టించుకోవడం అలవాటు లేదు.......' అన్నాడు రాంబాబు.

'ఎందుకు బాస్ ఈ వేళ మీరిలా చేస్తున్నారు?'

కొన్ని క్షణాల తరువాత విస్మయంతో అడిగాడు జాకాలు.

'ఏం చేస్తున్నాను?' ఆశ్చర్యంగా అన్నాడు రాంబాబు.

'రోజూ నవ్వేవారు ఈ రోజు మీరస్సలు నవ్వడంలేదు బాస్.....'

'ఎందుకు నవ్వడంలేదూ...నేను నవ్వుతూనే ఉన్నాను..... చీకట్లో నామొహం మీకు కనబడదు కాబట్టి తెలీడంలేదు.....'

'చిరునవ్వు కాదు బాస్....గట్టిగా నవ్వడంలేదని అంటున్నాను....'

'ఓ అదా ......హిహిహి......' అన్నాడు రాంబాబు.